క్లుప్తంగా

ఏకొల్లు పాఠశాల తనిఖీ

దొరవారిసత్రం: ఏకొల్లు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో కృష్ణయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనాన్ని నాణ్యతను తనిఖీ చేశారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. లేదా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

తహసీల్దార్‌గా నరసింహం

రాపూరు: రాపూరు తహసీల్దార్‌గా నరసింహం బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతిలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్యామ్ సుందరరాజ కలువాయికి బదిలీ అయ్యారు. మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయనను డీటీ సునీల్, సురేఖ, సర్వేయర్ శ్రీనివాసులు, కోటి, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పారదర్శకంగా పనులు

చిల్లకూరు: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని ఏపీవో గిరిబాబు ఆదేశించారు. ఆయన బుధవారం ఉపాధి క్షేత్ర సహాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు చేసే సమయంలో కూలీలు కనిపించేలా ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రూ.300 కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలన్నారు. వర్షాలు రాకమునుపే అనుకున్న మేర పనులు పూర్తి చేయాలని సూచించారు. ఫారం పాండ్ పనులను వేగవంతం చేయాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

పెళ్లకూరు: నియోజకవర్గం అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె బుధవారం పునబాక గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం వారసురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన తనను అన్నీ వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా ఆదరించడం సంతోషంగా ఉందన్నారు. అందువల్ల పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. మాజీ మంత్రి పరసా వెంకటరత్నయ్య, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచులు చిత్ర, నాగేంద్రరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు అప్పగింత

సాక్షి ఎఫెక్ట్..

నాయుడుపేట టౌన్: తపాలా కార్యాలయానికి వచ్చిన పాస్‌పోర్టును ఎట్టకేలకు పోస్టుమ్యాన్ బుధవారం బట్వాడా చేశారు. పాస్‌పోర్టు ఇవ్వడానికి పోస్టుమాన్ నగదు డిమాండ్ చేస్తున్నట్లు పాపారెడ్డికండ్రిగకు చెందిన చంద్రమౌళి రెడ్డి ఆరోపించారు. దీనిపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో పోస్టుమ్యాన్ బుధవారం బాధితుడి ఇంటికి వెళ్లి పాస్‌పోర్టు అందజేసి క్షమాపణ కోరారు. పోస్టుమ్యాన్ నిర్లక్ష్య వైఖరిపై పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విచారణ చేస్తున్నట్టు సమాచారం.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు స్పందన

దొరవారిసత్రం: మండలంలోని ఏకొల్లులో బుధవారం స్విమ్స్, శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. పురుషులు, మహిళల్లో నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, సర్పంచ్ బ్లెస్సీ, పంచాయతీ కార్యదర్శి రామయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

గూడూరు రూరల్: గూడూరులోని ఏరియా ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఉన్న బాలింతలకు బుధవారం వైజేపీ లయన్స్ క్లబ్ ప్రతినిధులు పౌష్టికాహారం, దుస్తులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రసవం అనంతరం ఇంటికి వెళ్లే బాలింతలకు పౌష్టికాహారం, చిన్న బిడ్డలకు ఉన్ని దుస్తులు అందిస్తున్నామని తెలిపారు. స్వామి, మురళీనాయుడు, రవీంద్రరెడ్డి, ఆర్వీ రావు, ప్రసాద్, గోపీనాథ్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

వాకాడు: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు టి.సుభాషిణి, పంబలి పాఠశాల ఉపాధ్యాయురాలు కె.సుష్మను బుధవారం వల్లమేడు స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్ఎం శోభారాణి, బీటీఏ నేతలు టీవీ రమణయ్య, మస్తానయ్య, మాల్యాద్రి, శ్రీనివాసరావు, యూటీఎఫ్ నేతలు బాలసుబ్రమణ్యం, శ్రీనివాసులురెడ్డి, ఏపీటీఎఫ్ హరికృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దు

గూడూరు రూరల్: వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు బుధవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. జోగి శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా రైతులకు పెట్టుబడి సాయం అందజేయకపోవడం దారుణమన్నారు. విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించాలని చూస్తే రైతులతో కలిసి తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నేతలు శ్రీనివాసులు, సురేష్, వెంకటయ్య, చంద్రయ్య, కేవీపీఎస్ నాయకులు అడపాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాలు



అమ్మవారి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు



పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ



జై పోలేరి.. జైజై పోలేరి

- పోలేరమ్మ జాతర ప్రారంభం
- ఆకట్టుకుంటున్న అలంకరణలు



పోలేరమ్మ ఆలయం వద్ద పూల అలంకరణ

వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తి పోలేరమ్మ జాతర బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారి నగరోత్సవం కోసం రాజాల ప్యాలెస్‌లో రథాన్ని సిద్ధం చేశారు. అమ్మవారి మూర్తిని తీర్చిదిద్దారు. ఆలయాన్ని పూలతో శోభాయమానంగా అలంకరించారు. గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా బుధవారం ఉదయం ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. జాతరకు 70 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు. తిరుపతి, సూళ్లూరుపేట, గూడూరు డిపోల నుంచి 40, వెంకటగిరి డిపో నుంచి 30 బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. నెల్లూరు, గూడూరు, రాపూరు, డక్కిలి, కామకూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను విశ్వోదయ కళాశాల, తిరుపతి వైపు వెళ్లే బస్సులను ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలుపుతామని చెప్పారు.

వాహనాలకు 10 పార్కింగ్ స్థలాలు

వాహనాల కోసం పది పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కుమ్మరిగుంట వద్ద రెండు, విశ్వోదయ కళాశాల ప్రాంగణం, ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల ఎదురుగా హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఖాళీ ప్రదేశాలను సిద్ధం చేశామన్నారు.

1200 మంది బందోబస్తు

జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 1200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ తెలిపారు. ఆర్వీఎం ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు విధుల్లో పాల్గొననున్నట్టు తెలిపారు. ప్రధానరోడ్లలో వ్యాపారుల సందడి నెలకొంది.

మద్యం విక్రయాలపై నిఘా

వెంకటగిరిలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం రాత్రి 7 వరకు మద్యం షాపులను మూసివేస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ వినయ్‌కుమార్ తెలిపా రు. మద్యం అమ్మకాలను అరికట్టేందుకు ముగ్గురు ఎస్ఐలు, 15 మంది సిబ్బందిని నియమించామన్నారు.

నేడు అమ్మవారికి సారె సమర్పణ

వెంకటగిరి(సైదాపురం): పోలేరమ్మకు గురువారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వం తరఫున సారె సమర్పించనున్నారు. ఇందులో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొననున్నారు.

సంతోషంగా జాతరను జరుపుకోండి

పోలేరమ్మ జాతరను సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వివాదాలు, గొడవలకు వెళ్లొద్దని కోరారు.

రోడ్డును తవ్వేడంపై ఫిర్యాదు



రోడ్డుకు అడ్డంగా తవ్వేసిన దృశ్యం

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు మీదుగా అమ్మన్‌ట్రై స్టీల్ పరిశ్రమకు వాహనాలు వెళ్లకుండా కొంతమంది రోడ్డును తవ్వేశారు. దీనిపై కంపెనీ ప్రతినిధులు బుధవారం పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలో ఉన్న స్టీల్ పరిశ్రమకు ముడి సరుకులు, అక్కడి ఉత్పత్తి అయ్యే స్టీల్‌ను రవాణా చేసుకోవడానికి అనుకూలంగా వాహనాల రాకపోకలకు గ్రామ సమీపంలో ఉన్న పట్టా భూముల్లో తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. ఆ రోడ్డును తవ్వేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయమై పరిశ్రమ ప్రతినిధులు స్థానిక ఎస్ఐ నాగరాజు, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

మధుసూదన్‌రెడ్డికి పరామర్శ



మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న తంబిరెడ్డి

ఓజిలి: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పిండుకూరు మధుసూదన్‌రెడ్డిని బుధవారం నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. మధుసూదన్‌రెడ్డిపై ఇటీవల టీడీపీ మూకలు దాడి చేశారు. దీంతో ఆయన ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో తంబిరెడ్డి ఆయనను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. దాడులు ఇలానే కొనసాగితే తర్వాత తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని చెప్పారు. ముత్యాలురెడ్డి పాల్గొన్నారు.

వరిలో విత్తన శుద్ధితో అధిక దిగుబడి



నాయుడుపేట టౌన్: రైతులకు పొలం బడి

రాపూరు: వరి సాగులో విత్తన శుద్ధిని తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో సోమసుందర్ తెలిపారు. మండలంలోని రాపూరు, రామిరెడ్డిపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగుకు ముందే విత్తన శుద్ధితో పాటు నీటి, ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. సర్పంచ్ జయమ్మ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

గూడూరు రూరల్: మండలంలోని కాండ్ర, వెందోడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చపట్టారు. ఏవోలు నిమ్మ తోటలకు వచ్చే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఓ రమేష్, పశువైద్యాధికారి సుదర్శన్, ఉద్యాన శాఖాధికారి కార్తీక్, కొండూరు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

బీజామృతంతో తెగుళ్ల నివారణ

నాయుడుపేట టౌన్ : బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా వరికి తెగుళ్లు రాకుండా నివారించవచ్చని ఏవో జె.గణేష్ తెలిపారు. అన్నమేడు, పుదూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. బీజామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏలు చెంగయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

పోటాపోటీగా బాలుర స్కూల్ గేమ్స్



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

నాయుడుపేట టౌన్: స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం నియోజకవర్గ స్థాయి బాలుర స్కూల్ గేమ్స్ నిర్వహించారు. ఆరు మండలాల్లో జరిగిన మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు పాల్గొన్నట్టు ఎంఈవో మునిరత్నం తెలిపారు. మండల స్థాయిలో అండర్ 17, 14 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, చెస్, యోగా, అథ్లెటిక్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో మంగళ, బుధవారాలు పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఇక్కడ గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. విద్యార్థులకు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ భోజన వసతి కల్పించారు.

పరసాకు అవమానమా.. గౌరవమా?

- మాజీ మంత్రి పరసారత్నంకు మార్క్ ఫెడ్ డైరెక్టర్ పదవి
- పదవి వచ్చిందని సంతోషమూ లేదు... రాలేదని దుఃఖమూ లేదు



టీడీపీ నేత పరసా వెంకటరత్నయ్య

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందిన పరసా వెంకటరత్నయ్యకు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పదవి ఇచ్చారు. దీనిద్వారా ఆయనను గౌరవించినట్టా! అవమానించినట్టా! అని ఆ పార్టీలోని నాయకులే చర్చించుకుంటున్నారు. పరసా వెంకటరత్నయ్య నియోజకవర్గ చరిత్రలో 30 ఏళ్లు ఒకే పార్టీలో ఉంటూ ఆరుసార్లు పోటీ చేసి మూడుసార్లు గెలిచిన పరసా వెంకటరత్నయ్య రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖామంత్రిగా పనిచేశారు. అలాంటి సీనియర్ నాయకుడికి మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా కాకుండా డైరెక్టర్ పదవి ఇవ్వడమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డైరెక్టర్ పదవి ఇవ్వడం ద్వారా ఆయనను అవమానించారని అభిమానులు భావిస్తున్నారు. ఆయన 2024లో ఏడోసారి కూడా టికెట్టు ఆశించారు. వయస్సు కూడా మీద పడిందని, ఇదే ఆఖరు సారి అని పార్టీ అధిష్టానానికి విన్నవించుకున్నా ఫలితం లేదు. లేదా తన కుమార్తెకు గాని, అల్లుడికి గాని టికెట్ ఇవ్వాలని కోరినా చంద్రబాబు, లోకేష్ పట్టించుకోలేదని ఆయన అప్పుడే ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్టు ఇవ్వకపోయినా మంచి పదవి వస్తుందనుకుంటే డైరెక్టర్ పదవి ఇచ్చి అవమానించారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. 'చంద్రబాబునాయుడు రాముడైతే నేను ఆయన్ని నమ్ముకున్న ఆంజనేయుడిని, ఆయన నాకు అన్యాయం చేయడు' అని ఎన్నో సందర్భాల్లో చెప్పిన పరసాను అవమానించారు అని తెలుగు తమ్ముళ్లు బాధపడుతున్నారు. పదవి లేకపోతే పోయింది గాని ఇలా అవమానించడం మాత్ర సరికాదనే మాట సర్వత్రా వినిపిస్తోంది.

సతీష్ ధావన్‌కు ఘన నివాళి



సతీష్‌ధావన్ మెమోరియల్ వద్ద షార్ శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగాల్లో సతీష్‌ధావన్ అత్యంత సాంకేతికపరమైన ప్రయోగాలకు శ్రీకారం చుట్టారని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలిపారు. సతీష్ ధావన్ జయంతిని బుధవారం షార్ కేంద్రంలోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో ఘనంగా జరుపుకున్నారు. షార్‌లోని రెండోగేట్ సమీపంలోని జీరో పాయింట్ వద్ద వున్న సతీష్‌ధావన్ మెమోరియల్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ భారత అంతరిక్ష ప్రయోగాలను డాక్టర్ విక్రమ్ సారాబాయ్ బుడిబుడి అడుగులతో ఇస్రోను నడిపించారని, సతీష్ ధావన్ నడక నేర్పించి ప్రపంచంలోనే బలీయమైన సంస్థగా ఆవిర్భవించేలా చేశారని కొనియాడారు. చిన్న తరహా రాకెట్ ప్రయోగాల నుంచి చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1 లాంటి గ్రహాంతర ప్రయోగాలు చేసే స్థాయికి చేరడం నాడు సతీష్‌ధావన్ వేసిన బీజమేనన్నారు. ఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ రాకెట్ల తర్వాత పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్లు ఆయన ఆలోచనల్లో పుట్టినవేనన్నారు. అత్యంత బరువైన ఉపగ్రహాలను ప్రయోగించాలంటే ఘన, ద్రవ ఇంధన దశల అవసరాన్ని గుర్తించింది కూడా ఆయనే అని చెప్పారు. సౌండింగ్ రాకెట్ల స్థాయి నుంచి నేడు ఆరు టన్నుల ఉపగ్రహాలను సొంతంగా తయారు చేసుకుని ప్రయోగించడంతోపాటు గగన్‌యాన్ లాంటి ఛాలెంజింగ్ ప్రయోగాలు చేసే స్థాయికి ఎదుగుతున్నామంటే ఆనాడు ఆయన వేసిన పునాదులేనన్నారు. వారి బాటలోనే నడుస్తూ అంతరిక్ష ప్రయోగాలను కొత్త పుంతలు తొక్కిస్తున్నామని వివరించారు. అనంతరం షార్ కేంద్రంలోని ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 123 మంది రక్తదానం చేశారు. సూళ్లూరుపేట పట్టణంలోని కేఆర్‌పీ కాలనీ సమీపంలో వున్న సతీష్‌ధావన్ మెమోరియల్ ఆసుపత్రిలోనూ ఆయనకు నివాళులర్పించారు. షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, షార్ అధికారులు పీ గోపీకృష్ణ, అన్ని విభాగాల అసోసియేట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత విద్య

- ఏడాది రూ.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు



ప్లేస్‌మెంట్ అధికారితో శ్రీహరికోట రమ్య

చిట్టమూరు (చిల్లకూరు): వైఎస్సార్ సీపీ అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థిని ఉన్నత చదువు చదివింది. కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ ఎంపికల్లో ఏడాదికి రూ.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. దీంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. నాడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసి పేదలను ఆదుకున్నారని తెలిపారు. ఆయన తనయుడు జగన్ కూడా అదే బాటలో నడిచి ఎంతో మంది పేదలకుమంచి చేశారని పేర్కొన్నారు. చిట్టమూరు మండలం ఆరూరు గ్రామానికి చెందిన శ్రీహరికోట రమ్య కావలిలోని విశ్వోదయ ప్రయివేట్ కళాశాలలో ఇంజినీరింగ్‌లో సీటు సాధించింది. ఆమెకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడేళ్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించింది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఫీజులు చెల్లించలేదు. తల్లిదండ్రులు ఈ ఏడాది ఫీజు చెల్లించారు. వచ్చే నవంబర్‌కు ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి కానుంది. ఈ క్రమంలోనే కళాశాలలో వివిధ కంపెనీల వారు చేపట్టిన ప్లేస్‌మెంట్ ఎంపికల్లో రమ్య ప్రతిభ చూపి సీ-5ఐ అనే కంపెనీలో కంప్యూటర్ సర్వీస్ ఇంజినీర్‌గా ఎంపికైంది. ఇంటర్వ్యూలకు 400 మంది హాజరయ్యారు. వారిలో 8 మందిని మొదటి దశలోను, వారిలో మళ్లీ నలుగురిని మాత్రమే ఎంపిక చేశారు. వారిలో రమ్య ఉంది. విద్యార్థిని మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక వరమన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

చిల్లకూరు: మండలంలోని మోమిడి పాఠశాల ఆవరణలో బుధవారం జిందాల్ పవర్ సింహపురి యూనిట్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల్లో పరిశ్రమ సీఎస్ఆర్ కింద పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇటీవల కంటి వైద్య శిబిరం నిర్వహించి 200 మందికి పరీక్షలు చేయించినట్టు పేర్కొన్నారు. వారిలో అవసరమైన 150 మందికి కంటి అద్దాలు అందజేస్తున్నామన్నారు. సర్పంచ్ ఈదూరు లావణ్య, మాజీ ఉప సర్పంచ్ జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలను కాపాడండి

ఓజిలి: మండలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు కఠినంగా వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. వారు బుధవారం ఎస్ఐ స్వప్నను కలిశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. మాజీ మండల కన్వీనర్ దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ ఎల్లా సురేష్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బట్టా పృథ్వీకుమార్‌యాదవ్, నాయకులు పి.కుమార్ నాయుడు, పి.ప్రసాద్, బి.అనీల్‌కుమార్‌యాదవ్, సీహెచ్ తిరుపాలయ్య పాల్గొన్నారు.

డీఆర్డీఏ పీడీపై చర్యలు తీసుకోవాలి

గూడూరు రూరల్: తిరుపతి జిల్లా డీఎఆర్‌డీఏ పీడీపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య డిమాండ్ చేశారు. ఆయన బుధవారం గూడూరులో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ పలు సంఘాలకు చెందిన నిధులను గోల్‌మాల్ చేసినట్టు ఆరోపించారు. డక్కిలి మండలంలోనే పొదుపు సంఘాల నిధులు రూ.కోటికి లెక్కలు తేలడం లేదని, దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తప్పు చేయని డక్కిలికి చెందిన సీసీలు సునీత, మంజులను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. కలెక్టర్ విచారణ చేయించి సునీత, మంజులకు పోస్టింగ్ ఇవ్వాలని కోరారు.

మట్టి ట్రాక్టర్ల అడ్డగింత



పెళ్లకూరు: మండలంలోని చెంబడిపాళెం గిరిజన కాలనీ సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం స్థానిక రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామం సమీపంలో ఉన్న అసైన్‌మెంట్ భూముల్లో మట్టిని యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లతో నాయుడుపేట, తాళ్వాయిపాడు, పెన్నేపల్లి గ్రామాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఆర్ఐ సంతోషినిబాయి అక్కడికి చేరుకుని మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అనుమతి లేకుండా మట్టిని రవాణా చేస్తే కఠిన చర్యలు తీకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట వీఆర్వో కళ్యాణి ఉన్నారు.

ఆగని మట్టి రవాణా

అధికారులు అక్కడి నుంచి వెళ్లిన తర్వాత మళ్లీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టిని తరలించారు. మట్టి తరలింపును పూర్తి స్థాయిలో అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానిక ఆర్డీవో చంద్రమునిని వివరణ కోరగా మట్టి తరలింపులు చేపట్టే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కాకాణిని కలిసిన గూడూరు ఎంపీపీ



గూడూరు రూరల్: వైఎస్సార్ సీపీ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని బుధవారం గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య కలిశారు. ఆయనను అభినందించారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, కొట్టు అశోక్, దయాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్

తడ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన ముగ్గురు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని జేవీవీ జిల్లా అధ్యక్షుడు సలవాది చెంగయ్య తెలిపారు. అంతకుముందు హెచ్ఎంలు సురేష్, శ్రీనివాసులు ప్రశ్నా పత్రాలను విడుదల చేశారు.